క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



మేడ్చల్: పట్టణంలోని 16 వ వార్డుకు చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో కౌన్సిలర్ ఉమానాగరాజుతో కలిసి చెక్కును అందజేశారు. వినయ్‌రెడ్డికి రూ.60 వేలు మంజూరయ్యాయి.

పీజేఆర్‌కు ఘన నివాళి



మేడ్చల్: మాజీ సీఎల్పీ నాయకుడు దివంగత కాంగ్రెస్ నాయకులు పి.జనార్దన్‌రెడ్డికి మేడ్చల్ కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు అంజలి ఘటించారు. కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, కొడె మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు



కిరాణ దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోచారం: రాచకొండ సీపీ, మల్కాజ్‌గిరి డీసీపీ ఆదేశాల మేరకు పోచారం పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నూతన సంవత్సరం–2025 వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యంనంపేట్‌లోని పాన్‌షాప్‌లు, ఇతర దుకాణాలను సీఐ రాజువర్మ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఇతర పోలీసులు తనిఖీలు చేపట్టారు.

నేడు గట్టు మైసమ్మ జాతరపై సమావేశం



పావనీ, ఘట్‌కేసర్ చైర్‌పర్సన్

ఘట్‌కేసర్: ఏటా జనవరి నెలలో జరగనున్న గట్టు మైసమ్మ అమ్మవారి జాతర నిర్వహణపై ఈవో భాగ్యలక్ష్మి నేడు సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందని, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, కులసంఘాల నేతలు, యువజన సంఘాల సభ్యులు పాల్గొనాలని సూచించారు.

సత్కారం



ఇన్‌స్పెక్టర్‌తో యూత్ కాంగ్రెస్ నేతలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ యూత్ కాంగ్రెస్ నేతలు శనివారం మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను కలిశారు. నూతనంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షులు పవన్‌కళ్యాణ్, మున్సిపల్ అధ్యక్షులు రాకేష్, ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ శేఖర్, మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఇన్‌స్పెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్



మణికంఠ

పోచారం: గంజాయి విక్రయిస్తున్న యువకుడిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి రెండు పడకల భవన సముదాయంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. మల్లాపూర్‌లో ఉంటూ.. మూసాపేట్‌లోని ఓ కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ రెండో సంవత్సరం చదువుతున్న మణికంఠ (21)ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

అటకెక్కిన యంత్రలక్ష్మి !

- పరికరాల కోసం ఎదురు చూస్తున్న రైతులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

ఘట్‌కేసర్: ఆధునిక వ్యవసాయానికి యాంత్రీకరణ ఎంతో ముఖ్యమని ప్రభుత్వాలు గుర్తించాయి. అన్నదాతల సమయం, వ్యయం ఆదా చేసేందుకు దశాబ్దకాలంగా రైతులకు యంత్రపరికాలు అందజేస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం, బీసీ, ఓసీ అభ్యర్థులకు 50 శాతం రాయితీతో అందించేవారు. రైతులకు చేదోడు, వాదోడుగా ఉండాల్సిన యంత్రాలు 6 ఏళ్లుగా నిలిచిపోయాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు..

నూతన ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాదైన రైతుల సంక్షేమం కోసం అమలు చేయాల్సిన పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానంతో యంత్ర పరికరాలను అందజేయాలని ప్రభుత్వం గతంలో యంత్రలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. యంత్రాల పంపిణీ కోసం ప్రతి ఏటా యాసంగి, వానాకాలం ముందు వ్యవసాయ శాఖాధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరికరాలను అందజేశారు. పిచికారి యంత్రాలు, టిల్లర్స్, కల్టివేటర్, గొర్రు, బ్లేడ్లు, పుల్‌వీల్స్, 9 దుంపల నాగళ్లు, చేతిపంపులు, ట్రాక్టర్లను సబ్సిడీతో ఇచ్చేవారు. యంత్రాలపై ఆసక్తి పెంచుకున్న రైతులు యాసంగి పనులు ప్రారంభమైన పంపిణీ విషయమై మాటెత్తకపోవడంతో నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

కనిపించని పథకం...

యంత్రలక్ష్మి పరికరాలతో వ్యవసాయ పనులు త్వరితగతిన పూర్తికావడంతో సమయం, డబ్బు ఆదా అయ్యేది. ఆయా పరికరాలను కొనుగోలు చేసే ఆర్థిక స్థాయిలేక నియోజకవర్గంలోని చాలామంది చిన్నకారు రైతులు యంత్ర పరికరాలను వినియోగించడం లేదు. దీంతో కూలీల వ్యయం, అద్దె యంత్రాల వ్యయం ఎక్కువ కావడంతో రైతులకు గిట్టుబాటు లేకుండా పోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీతో యంత్ర పరికరాలను అందజేయాలని కోరుతున్నారు.



వరి పంటకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

ప్రస్తుతం పథకాలు అమలులో లేవు..

మండల వ్యవసాయాధికారి బాసిత్‌ను దీనిపై వివరణ కోరగా.. ప్రస్తుతం సబ్సిడీ యంత్ర పరికరాలు అందజేసే సంక్షేమ పథకం లేదని చెప్పారు. భవిష్యత్తులో బడ్జెట్ కేటాయించే అవకాశం ఉందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తామన్నారు.



సబ్సిడీ ట్రాక్టర్‌ను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

మరిచిపోయిన ప్రభుత్వం...



రైతుల బాగోగుల కోసం గతంలో సబ్సిడీతో వ్యవసాయ రంగానికి సహాయకారంగా ఉండే యంత్రపరికాలను అందజేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీ పరికరాల ఊసెత్తడం లేదు.

– కొమ్మిడి శోభారాణి, రైతు అంకుషాపూర్

సమయం ఆదా అవుతుంది...



యంత్రపరికరాలతో రైతుల సమయం ఆదా అయ్యేది. తక్కువ వ్యయం పనులు పూర్తయ్యేవి. దీంతో కూలీల సమస్య తప్పుతుంది. ప్రస్తుతం ప్రతి పనికి అద్దె పరికరాలను తీసుకోవాల్సి వస్తుంది.

– బొక్క కష్టారెడ్డి, రైతు బొక్కొనిగూడెం

సబ్సిడీ పరికరాలను అందజేయాలి..



రైతు ప్రభుత్వం అంటూనే రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు మరిచిపోయింది. దీంతో సాగుబడి ఖర్చు పెరిగి రైతులు నష్టాలభారిన పడుతున్నారు. గతంలో అందించిన విధంగానే సబ్సిడీ యంత్ర పరికరాలను అందజేయాలి.

–పన్నాల కొండల్‌రెడ్డి, రైతు అవుషాపూర్

ఆలయం తొలగించొద్దని ఆందోళన

కీసర: రోడ్డు విస్తరణలో భాగంగా నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి–చర్లపల్లి రహదారిలో అడ్డాగు వద్ద ఉన్న పురాతన రామాంజనేయ స్వామి ఆలయాన్ని తొలగించొద్దని శనివారం రాంపల్లి, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ (రేపల్లే)లకు చెందిన ఆంజనేయస్వామి భక్తులు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. మహిమాన్వితమైన ఈ దేవాలయాన్ని రాంపల్లి, చర్లపల్లి రహదారి 100 అడుగుల విస్తరణలో భాగంగా తొలగించాలని అధికారులు చూస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో దేవాలయాన్ని తొలగించనివ్వమన్నారు. ఆలయాన్ని తొలగించకుండా ప్రత్యామ్నాయ మార్గంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కమిషనర్ భాస్కర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి దేవాలయాన్ని తొలగించకుండా కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. రాంపల్లి, ఇస్మాయిల్‌ఖాన్ గ్రామస్తులు, గ్రామపెద్దలు, ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న భక్తులు

నిత్యావసరాల పంపిణీ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మదర్ థెరిస్సా కాలనీలో 'గ్రేస్ సర్వీస్ సొసైటీ' సంస్థ ఆధ్వర్యంలో శనివారం కుష్టు రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు జాకోబ్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ నిరుపేదలకు తమవంతు సహాయం అందించాలని సూచించారు. ఎస్ఎల్‌ఏసీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ సిబ్బంది చంద్రశేఖర్, అనసూయ, గంగాధర్, సుజాత, రవి, శారద, మల్లయ్య పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి హోమం

కలెక్టరేట్‌లో వినూత్న నిరసన



సాక్షి,సిటీబ్యూరో: న్యాయమైన హక్కుల సాధన కోసం 'సమగ్ర శిక్ష అభియాన్' జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరింది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావాలని కోరుతూ.. లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయగలరని, ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్‌డే

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్‌డే ఘనంగా జరిగింది. సీఎంఆర్ గ్రూప్స్‌లోని ఎంబీఏ, ఎంటెక్, ఫార్మ్–డి, ఫార్మసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డేలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులకు మెడల్స్ బహుకరించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు స్టార్టప్స్ వైపు అడుగులు వేయాలని సూచించారు. భవిష్యత్తు అంతా బిజినెస్ మేనేజ్‌మెంట్ వైపు నడుస్తుందని, విద్యార్థులు అందులోని మూలాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అవరోధించాలని కోరారు. సీఈఓ అభినవ్ రెడ్డి, డైరెక్టర్ జంగారెడ్డి, కో– ఆర్డినేటర్ కోటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ దేవదాస్, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామరావు, మధుసూదన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న మేరి జెస్సికా, గోపాల్‌రెడ్డి

పేద విద్యార్థినికి చేయూత

కీసర: పేద విద్యార్థులకు చేయూతను అందించేందుకు తాము ఎల్లప్పుడు ముందుంటామని, కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న అన్నారు. ఈ మేరకు శనివారం కీసరలోని శ్రద్ధ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సుమకు ఈ ఏడాది కళాశాల ఫీజును వారు చెల్లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థిని ఫీజు మొత్తం తాము భరిస్తామని, గతంలోనే ప్రకటించి రెండేళ్ల ఫీజును తామే చెల్లించామని, ఈ ఏడాది కూడా చెల్లిస్తామని స్పష్టం చేశారు.



యువకుడి అదృశ్యం



ప్రకాష్

జవహర్‌నగర్: యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ చర్చి మల్కారంలో నివసించే ఆలకుంట రాధాకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కాగా ఆమె చిన్న కుమారుడు ప్రకాష్ (24) కూలీ పనిచేస్తుంటాడు. అప్పుల బాధతో మానసిక ఒత్తిడికి గురైన అతడు ఈనెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతికినా లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ మహేంద్రహిల్స్ కళాశాలలో న్యూట్రిషన్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. న్యూట్రిషన్ సబ్జెక్టులో పీజీతో పాటు సెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. 3 జనవరి, 2025లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. మచ్చబొల్లారంలోని మోతులకుంటచెరువు సమీపంలోని సర్వేనెంబర్ 198,199లో హిందూ శ్మశానవాటికను అల్వాల్ జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా డంపింగ్ యార్డుగా మార్చారని, దీంతో చుట్టుపక్కల 50 కాలనీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్‌వో రజిని, రాంకీ అధికారులతో మాట్లాడి తక్షణమే డంపింగ్‌యార్డు ప్రాంతానికి రావాలని ఆయన సూచించారు. రోజూ డంపింగ్ యార్డులోని చెత్తను ప్రాసెస్ చేసి ఇక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. 48 కాలనీల జాయింగ్ యాక్షన్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు రమేష్, పరమేష్, శోభన్‌బాబు, మల్లేష్‌గౌడ్, యాదగిరిగౌడ్, ప్రశాంత్, నరేష్, జావేద్ పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఫామ్‌హౌజ్‌పై కేసు

అనుమతి లేకుండా లిక్కర్‌కు అనుమతి

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా లిక్కర్ సర్వ్ చేసిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయంలో 2013–14లో విద్యను అభ్యసించిన పదోతరగతి విద్యార్థులు ఎదులాబాద్ కొత్తగూడెం సమీపంలోని ఫామ్‌హౌజ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో అనుమతి లేకుండా లిక్కర్‌ను సేవించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫామ్‌హౌజ్‌లో తనిఖీలు చేపట్టగా.. 2 కేసుల బీర్లు లభించాయి. అనుమతి లేకుండా లిక్కర్‌కు అనుమతినిచ్చిన ఫామ్‌హౌజ్ యజమాని మహేష్‌సింగ్, మేనేజర్ బింగి శ్రీశైలం, ఆర్గనైజర్ వికాస్‌పై కేసు నమోదు చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో డెకరేషన్ షాపు దగ్ధం

రూ.25 లక్షల మేర నష్టం

కుషాయిగూడ: ఓ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధి కాప్రాలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రకుమార్‌గౌడ్ కాప్రా, శ్రీనగర్‌కాలనీలో డెకరేషన్ షాపును నిర్వహిస్తున్నారు. సాయంత్రం షాపు మూసి ఉన్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.25 లక్షల సామగ్రి దగ్ధమైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా !

- పురపాలికలు..పంచాయతీ స్థలాల్లో రేకుల షెడ్లు
- గ్రామ కంఠం భూములపై కబ్జాదారుల కన్ను
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్టు యంత్రాంగం

సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఖాళీ జాగా కనిపిస్తే చాలు తగిన ధ్రువపత్రాలు సృష్టించుకోవడం.. వాటిలో తక్షణం రేకుల షెడ్లు లాంటి నిర్మాణాలతో పాగా వేయడం పరిపాటిగా మారుతోంది. తాజాగా కొందరు నేతల కన్ను గ్రామకంఠంతో పాటు బడుగు బలహీన వర్గాల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములపై పడింది.

ధరలు పెరగడంతో..

ప్రస్తుతం పురపాలక సంఘాలు, గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాలకు తెరలేపుతున్నారు. ప్రభుత్వ భూములు కాపాడేందుకు రెవెన్యూ, పురపాలక సంఘాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రయత్నిస్తున్నా... ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు రావడంతో మిన్నుకుండి పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

ఈ మధ్య కాలంలో ఇలాంటి కబ్జాలపై ప్రజలు కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. శివారు మేడ్చల్ జిల్లాలో భూకబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.



స్టేడియం స్థలంలో అక్రమంగా ప్లాట్లు చేసి ఇళ్ల నిర్మాణాలు

మిగులు లెక్క ఏదీ..!

నగర శివారు పురపాలికలతో సహా పంచాయతీల్లో గ్రామకంఠంలో ఎక్కడెక్కడ మిగులు భూములున్నాయనే దానిపై ఇప్పటి వరకు పక్కాగా లెక్కలు లేని పరిస్థితి నెలకొంది.

ఇష్టానుసారంగా మార్పు..

డివిజన్ రిజిస్టర్‌లో నమోదైన గ్రామకంఠం భూములను ఎవరికి వారుగా మార్పులు, చేర్పులు చేసుకుని హక్కుదారులుగా మారిన పరిస్థితి కనిపిస్తోంది. మిగిలిన భూములకు సైతం ఓఆర్సీలు పొందడానికి నిత్యం పంచాయతీల్లో ప్రయత్నాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఆక్రమణలు ఇలా..

బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబర్లు 63/1–63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా.. 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. అప్పట్లో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఉండటంతో ఓ కబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్షకు విక్రయించినట్లు సమాచారం.

గజానికి రూ.10 వేలు..

మళ్లీ ఇదే స్థలాన్ని దేవేందర్‌నగర్ ,అంబేద్కర్‌నగర్ 1,2 రాజీవ్‌నగర్, గౌతమ్‌నగర్ కాలనీల పేరుతో కొందరు మధ్య దళారులు 60 గజాల నుంచి 80 గజాలు ఉండేలా.. కొత్త లేఅవుట్ తయారు చేసి,. ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున అమ్ముతున్నారు. ఇక్కడే పార్కు, శ్మశ్మాన వాటికకు చెందిన 2611 గజాల స్థలంతో పాటు అక్షయనగర్‌లో 509 గజాలు, వేంకటేశ్వర్‌నగర్‌లో 350 గజాల పార్కుల స్థలం ఆక్రమణకు గురైంది.

- పీర్జాదిగూడలోని 13 కాలనీల్లోని 3 ఎకరాల పార్కుల స్థలాలు కూడా కబ్జాదారుల గుప్పిట్లో ఉన్నాయి. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.లక్షల విలువ చేసే 41 గుంటల భూమి ఆక్రమణకు గురైంది. నారపల్లి పెద్దచెరువు ప్రాంతంలో పదెకరాల ప్రభుత్వ, ఫారెస్టు, ఇరిగేషన్ భూమి కబ్జాకు గురవుతోంది. ఘట్కేసర్ మన్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో పదెకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. వెంకటాపూర్‌లో నాడెం చెరువు భూములు కబ్జాకు గురయ్యాయి.
- కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సర్వేనంబర్199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించి, ప్లాట్లు చేసి, ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షలకు విక్రయిస్తున్నారు.
- ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వేనంబర్ 24లోని రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు భూకబ్జాదారులు స్థలాన్ని చదును చేసి ఆక్రమిస్తున్నారు.



కీసరగుట్ట రోడ్డు ప్రాంతంలో ఫారెస్టు స్థలం ఇలా..

- కీసరలోని సర్వేనంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా.. భూకబ్జాదారుడు నకిలీ కాగితాలను సృష్టించి.. రెండెకరాల స్థలంలో భవన నిర్మాణం చేపట్టినా.. ఫారెస్టు, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.
- కీసర రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 825లో ఉన్న 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉండగా.. ఇక్కడనే 181 సర్వేనంబరులోని రెండెకరాల ప్రభుత్వ భూమి కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారు.
- యాప్రాల్‌లో సర్వేనంబర్ 171లోని బండాయి కుంటను ఆక్రమించి, ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. అహ్మద్‌గూడలో సర్వేనంబర్ 22లో పార్కుస్థలం కబ్జాకు గురైంది.
- నాగారంలోని 297 సర్వేనంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. చీర్యాల గ్రామంలోని సర్వేనంబర్ 7,8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 152/2లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు
- గాగిల్లాపూర్‌లోని 214 సర్వే నంబరులో 57 ఎకరాల అసైన్డ్ భూమిలో 40 ఎకరాలు, డి.పోచంపల్లిలో 120 సర్వేనంబరులో 152 ఎకరాల అసైన్డ్ భూమిలో 60 ఎకరాలు కబ్జా గురైనట్లు తెలుస్తోంది.
- నిజాంపేట్‌లోని 332,233,334 సర్వేనంబర్లలోని 300 ఎకరాల్లో సగం భూములను కబ్జాచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. గాజుల రామారంలోని సర్వేనంబర్లు 307, 329,79,307లలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురైనా.. పట్టించుకోవడం లేదు.
- జవహర్‌నగర్‌లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇందులో ప్రైవేట్ ఆసుపత్రితో పాటు ఇతర సంస్థల నిర్మాణాలు చేపట్టారు. నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పలు పురపాలక సంఘాలు, పంచాయతీల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, చెరువుశిఖం, ఫారెస్టు భూములు కబ్జాకు గురైనట్లు అధికార యంత్రాంగానికి తరచుగా ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. భూముల కబ్జాల విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే భూపరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.